
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 4 నవంబరు 2025

త్వరలో నిర్వాసితుల సమస్యల పరిష్కారం : విప్

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంలోని ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలోని సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభానికి వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి గ్రామానికి చెందిన నిర్వాసితుడు మారవేని దుర్గయ్య తీసుకువెళ్లాడు. దీంతో స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ గరిమా అగర్వాల్ విప్‌కు తెలియజేశారు.

కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు



ప్రారంభమైన నిర్మాణ పనులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మాదిరిగానే అన్ని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అదేశాలు జారీ చేయడంతో పాటు విగ్రహం ఏర్పాటుకు రూ.13లక్షల 76వేల మంజూరు చేయడంతో సోమవారం సంబంధిత అధికారులు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్మాణాలను ప్రారంభించారు. వారం రోజుల్లో విగ్రహ ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు డబ్బులు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నర్సింగాపూర్ గ్రామస్థులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూంను అప్పులు చేసి ఇళ్లను నిర్మించుకున్నామని వాటికి సంబంధించిన డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాలని లబ్ధిదారులు ఆందోళన చేపట్టారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం బోయిన్‌పల్లి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 2023 సంవత్సరంలో గ్రామంలో ఇళ్లులేని 20 కుటుంబాలకు డబుల్ బెడ్‌రూంలను మంజూరు చేసినట్లు అధికారులు ప్రకటించడంతో అప్పు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని తెలిపారు. కలెక్టర్ స్పందించి మా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి డబ్బులను ఇప్పించి మా కుటుంబాలను అదుకోవాలంటూ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు కనుకవ్వ, సంధ్య, రెడ్డవేణి పద్మ, లాల్ రేణుక, ఎదులాపుం ఓంకారమ్మ, బోజ్జ నర్సమ్మ, రేగుల మమత, రెడ్డవేణి స్వప్న, సావనపల్లి అనిత, సావనపల్లి ఉమ, మమత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలల్లో రిజర్వేషన్ కల్పించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు కోరారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్‌ను పెంచుతూ గవర్నర్ అమోదించి ఈ బిల్లులు కేంద్రానికి పంపించి 7 నెలలు గడుస్తున్నా కేంద్రంలో పెండింగ్‌లో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాలు ఏర్పాటుచేసి కేంద్రంపై ఒత్తిడి పెంచి 9వ షెడ్యూల్ అమలు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్, కోడి అంతయ్య, కోడం రమేష్, అలకుంట దుర్గయ్య, తెంబరవేణి వేణు, వోల్లెపు బాబు, భాస్కర్, గోల్లపల్లి మశ్చేందర్, సుద్దాల కరుణాకర్, మల్యాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీలేఖ

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగ వంతం చేయాలని ఎంపీడీవో శ్రీలేఖ అన్నా రు. వీర్నపల్లి మండలం రంగంపేట, లాల్‌సింగ్‌తండాలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఏమైనా సమస్యలున్నాయా అని లబ్ధిదారులను ప్రశ్నించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. తరగతి గదులు, వంట గది, పరిసరాలను పరిశీలించారు. గృహనిర్మాణ శాఖ ఏఈ చైతన్య, పంచాయతీ కార్యదర్శులున్నారు.

వైన్స్ ఫర్ సేల్



- లక్కు దక్కిన వారి చుట్టూ మద్యం వ్యాపారుల చక్కర్లు
- జిల్లాలో రూ. కోటి వరకు గుడ్ విల్ ఆఫర్లు
- జిల్లాలో 48 దుకాణాల కేటాయింపు
- డిసెంబరు 1 నుంచి కొత్త దుకాణాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మద్యం వ్యాపారంలో అనుభవాలు లేకపోయినా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందకు కొందరు టెండర్లు వేశారు. వారిలో లక్కు వరించిన వారి చుట్టూ మద్యం వ్యాపారులు చక్కర్లు కొడుతున్నారు. దుకాణాలను డ్రాలో దక్కించుకున్న వారు కొందరు వాటిని అమ్ముకునేందుకు ముందుకు వస్తున్నారు. జిల్లాలో 48 మద్యం దుకాణాల్లో 9 గౌడ సామాజిక వర్గానికి, ఐదు దుకాణాలు ఎస్సీ వర్గానికి రిజర్వ్ చేశారు. మిగతా జనరల్‌గా ఉన్నాయి. ఇందుకోసం మద్యం వ్యాపారులు 1,381 టెండర్ దరఖాస్తులు సమర్పించారు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలో డ్రా పద్ధతిలో దుకాణాల కేటాయింపు జరిగింది. సిండికేట్‌గా మారి టెండర్లు వేసిన లక్కు దక్కకపోవడంతో లక్షలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నారు. మద్యం వ్యాపారమే ప్రధానంగా ఉన్న వ్యాపారులు మాత్రం రిజర్వేషన్లతో పాటు ఒకరిద్దరు కలిసి టెండర్లు వేసిన వారిలో కొందరికి అదృష్టం వరించింది.

కాని దుకాణం నడపడానికి ఆర్థిక స్తోమత అడ్డుగా మారడంతో వారి నుంచి దుకాణాలు దక్కించుకోవడానికి వ్యాపారులు మంతనాలు జరుపు తున్నారు. దుకాణం సేల్స్‌ను బట్టి రూ 60 లక్షల నుంచి రూ కోటి వరకు బేరసారాలు కొనసాగుతున్నాయి. మద్యం దుకాణాల టెండర్ల సమయంలోనే 10 నుంచి 20 మంది వరకు ఒక్కో గ్రూపుగా మారి టెండర్లు వేశారు. ఇందులో దుకాణాలు వచ్చిన గ్రూపుల్లో ఎవరికో ఒకరికి దుకాణం అప్పగించి లక్షల్లోనే గుడ్ విల్ మాట్లాడుకొని తప్పుకుంటే మరికొందరు వాటాల పంచాయతీలు పెట్టుకుంటున్నారు.

అడ్డాల కోసం పరుగులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో దుకాణాలకు సంబంధించి లైసెన్సులు దక్కించుకున్న వారు దుకాణం అడ్డా కోసం పరుగులు తీస్తున్నారు. మద్యం షాపు అద్దె అగ్రిమెంటు, బ్యాంకు గ్యారంటీ ఉంటేనే లైసెన్స్ ఖరారు చేస్తారు. దుకాణం దక్కించుకున్న వారు ఆరోవంతు ఎక్సైజ్ ఫీజును ప్రభుత్వానికి చెల్లించి మద్యం దుకాణాలకు లైసెన్సులకు కన్ఫర్మేషన్ లెటర్లు పొందాలి. ఈసారి మున్సిపల్ పరిధిలో దుకాణాలు ఎక్కడైనా ఏర్పాటు చేసుకునే సౌకర్యం ఉంది.

అయితే జాతీయ రహదారులకు 200 మీటర్ల దూరం, బడి, గుడికి 100 మీటర్ల దూరంగా ఉండాలనే నిబంధన ఉంది దీనికి అనువైన దుకాణాల అడ్డాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. డిసెంబరు 1 తేదీ నుంచి దుకాణాలు తెరుచుకునే వీలు ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లకు మద్యం వ్యాపారులు తలమునకలు అవు తూనే గుడ్ విల్‌తో మరి కొన్ని దుకాణాలను సొంతం చేసుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. జిల్లాలో 48 మద్యం దుకాణాలకు 1,381 దరఖాస్తులు చేసు కోగా సిరిసిల్ల సర్కిల్‌లో 598 దరఖాస్తులు, వేములవాడ సర్కిల్ 354 దరఖాస్తులు, ఎల్లారెడ్డిపేట సర్కిల్ 429 దరఖాస్తులు వచ్చాయి. 2023-25 సంవత్సరానికి సంబంధించిన లైసెన్స్ కోసం 2,031 దరఖాస్తుల ద్వారా రూ. 40.72 కోట్లు ఆదాయం సమకూరింది. ప్రస్తుతం 2025-27 సంవత్సరానికి

మిగతా 8వ పేజీలో

చెకుముకి టాలెంట్ టెస్టు

సిరిసిల్ల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి టాలెంట్ టెస్టు వాల్‌పోస్టర్‌ను సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ జి నగేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ బాలబాలికలలో శాస్త్రీయ స్వభావాన్ని తార్కిక ఆలోచనలను సైన్స్ పట్ల ఆసక్తిని, సజనాత్మక శక్తిని పెంపొందించడానికి టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయం అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చెకుముకి టాలెంట్ టెస్టు నాలుగు దశలో జరుతుందన్నారు. నవంబర్ 7న పాఠశాలల స్థాయి, నవంబర్ 21న మండలాల స్థాయి పోటీలు, నవంబర్ 28న జిల్లా స్థాయి, డిసెంబర్ 12 నుండి 14 వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని టాలెంట్ టెస్టులను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బుర్క గోపాల్, తవుటు మధుసూదన్, జిల్లా కార్యదర్శి రాజలింగం, జిల్లా సభ్యుడు హనుమంత్‌గౌడ్ పాల్గొన్నారు.

రామచంద్రాపూర్‌కు బోర్ మంజూరు

సిరిసిల్ల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామానికి ఎంపీ నిధులతో బోర్ మంజూరు కావడంతో సోమవారం గ్రామంలో బీజేపీ నాయకులు భూమి పూజలు చేసి బోర్ వేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజు, చిందం సురేష్, రాజు, సందీప్, ముత్యం తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని తెలంగాణ బహుజన జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధిరాములు, జిల్లా అధ్యక్షుడు ముద్రకోల అంజనేయులు డిమాండ్ చేశారు. తెలంగాణ బహుజన జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు బీడీ కార్మికులతో నాయకులు తరలివచ్చి కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నాచేసి కలెక్టరేట్‌లో ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీడీ పరిశ్రమలలో 2010 సంవత్సరంలో 33 రోజుల పాటు సమ్మె చేసి సాధించుకున్న జీవో నంబర్ 41 ప్రకారం బీడీ కార్మికులకు వేతనాలు, కరువు భత్యం చెల్లించాలని, వెయ్యి బీడీలకు రూ. 8వందల కూలీ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ , ఇన్సూరెన్స్ ఇవ్వాలని, బీడీ పరిశ్రమపై జీఎస్టీ, కోప్టా చట్టం రద్దుచేయాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వర్ధి బీడీలను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రనాయకులు పోశెట్టి , సిద్ధిరాములు, హరి, నర్సింహులు, రాంచంద్రం, యాదగిరి, రాజేష్, రవీందర్, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం



గ్రీవెన్స్‌డేలో బాధితుల సమస్య వింటున్న ఎస్పీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో పాటు బాధితుల సమస్యలను పరిష్కరించడమే తమ లక్ష్యమని ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లాపోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 23 మంది బాధితులతో మాట్లాడి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీసుల సేవలు ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా , ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లకు వచ్చిన ఫిర్యాదుదారులతో మార్యాదపూర్వకంగా ప్రవర్తించి అవసరమైన క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. ఫిర్యాదుదారులకు పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికపుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్‌డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావడంతో సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

చేపపిల్లల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి

- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పారదర్శకంగా చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని రాష్ట్ర పశుసంవర్ధశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్‌నుంచి సంబంధిత అధికారులతో కలిసి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి జిల్లాలో చేపపిల్లల పంపిణీపై జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నాటికి నిర్ధేశించుకున్న లక్ష్యం మేరకు నీటి వనరులలో చేపలు, రోయ్య పిల్లలను విడుదల పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టినీటి వనరుల్లో చేప పిల్లల విడుదల చేయాలన్నారు. టీ-మత్స్యయాప్‌లో చేపపిల్లల సరఫరాదారుల, రవాణా చేసే వాహనం సంపూర్ణ వివరాలు మత్స్యశాఖ అధికారి పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. ప్రతి నీటి వనరుల దగ్గర ఎన్ని చేపపిల్లలు విడుదల చేస్తున్నామో వివరాలు తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. చేపల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యశాఖ అధికారులతో పాటు నీటి పారుదల శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీడీవోలు, జిల్లా పంచాయతీ అధికారులు, కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పర్యవేక్షించాలన్నారు. చేపల పంపిణీ కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు చేప పిల్లల విడుదల కార్యక్రమాలను పూర్తి చేస్తామని ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, డీపీవోషర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



ఆవునూర్‌లో ధర్నా చేస్తున్న రైతులు

ముస్తాబాద్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవునూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతన్నలు రోడ్డెక్కారు. ఐకేపీ సెంటర్‌లో రెండు లారీలు నిండి ఉన్నా రైస్ మిల్లర్లు ధాన్యం దించుకోవడం లేదని మండిపడ్డారు. దీంతో సెంటర్లలో ధాన్యం అలాగే ఉండి రైతన్నలు ఇబ్బంది పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి మండిపడ్డారు. ప్రభుత్వం నిర్లక్ష్యం , అధికారుల ముందుచూపు లేక కొనుగోళ్లు వేగవంతంగా జరుగడం లేదన్నారు. కార్యక్రమంలో రైతులకు మద్దతుగా కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పొన్నాల సత్యంరెడ్డి, బీజేపీ నాయకులు నర్ర ప్రశాంత్, మహేశ్, గణేశ్, శ్రీకాంత్,రాజు, బాల్‌రెడ్డి, సతీశ్ రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం

సిరిసిల్ల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం అప్రజాస్వామికం అని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాది జిల్లా ములుగు గూడూరులోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం దుర్మార్గం అన్నారు. పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు బీఆర్‌ఎస్‌కు అనుకూలమని సర్వేలో తేలడంతో కాంగ్రెస్ పార్టీ గుండాలు దాడులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు రాజకీయాలను శాసించలేవని మా సంకల్పాన్ని దెబ్బ తీయలేవన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందనే అసహనంతో ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్కే అప్రోచ్, వడ్లూరి వేణు, సిరిమల్లె హరిష్, సంపత్, కనకయ్య, రమేష్, నరేష్, రాము పాల్గొన్నారు.

జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఇన్‌చార్జి కలెక్టర్‌తో కలిసి సీసీఐ కొనుగోలు కేంద్రాల ప్రారంభం

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లాను రాష్ట్రం లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామని వేములవాడ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని నాంపల్లిలో, సంకెపల్లి గ్రామాల్లో ఇన్‌చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్‌తో కలిసి సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైతులకు మద్దతు ధరను అందించాలనే ఉద్దేశ్యంతో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని అన్నారు. రైతులు పండించిన పత్తి పంట క్వింటాకుకు రూ. 8,110 మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. ఈ ప్రాంతంలో నల్లరేగడి భూములు ఎక్కువగా ఉన్నాయని మిర్చి, పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారని వివరించారు. సీసీఐ కొనుగోలు విషయంతో వచ్చిన మార్పులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకువెళ్లామన్నారు. రైతులకు అండగా నిలబడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ముందుగా ఉంటుందని, దానికి నిదర్శనమే ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ అందించడం, చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ఏకకాలంలో రూ. 2 లక్షలు రైతులకు రుణమాఫీ చేశారని గుర్తుచేశారు. సన్నవడ్లు పండించిన వడ్లకు క్వింటాళుకు రూ.500 బోనస్ అందించడం రైతులపై ప్రభుత్వానికి వున్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రైతులకు నేడు సాగునీరు అందుతుందంటే కారణం ఆనాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించిన ప్రాజెక్టులే కారణమని అన్నారు. నూతనంగా వచ్చిన ఇంచార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్‌కు జిల్లాలోని అభివృద్ధి పనులపై స్పష్టత వచ్చిందని, అభివృద్ధి పురోగతిపై పూర్తిగా తెలుసుకున్నారని అన్నారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచుతూ ముందుకు సాగుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, మార్కెటింగ్ జిల్లా అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో బింగి కీర్తన, మార్కెట్ కమిటీ కార్యదర్శి సత్యనారాయణ, సింగిల్విండో చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి నాయకులు నీలం శ్రీనివాస్, ఏరెడ్డి రాజిరెడ్డి, బీరెడ్డి ఆరోగ్యరెడ్డి ఉన్నారు.



పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ఇన్‌చార్జి కలెక్టర్

కపాస్ కిసాన్ నమోదు చేసుకోవాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరీమా అగర్వాల్

జిల్లా వ్యాప్తంగా 46 వేల ఎకరాల్లో పత్తి సాగు జరిగిందని, 5 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి రానున్నట్లు అంచనా ఉందని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమీ అగర్వాల్ పేర్కొన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తి తీసుకువచ్చే రైతులు తప్పకుండా కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు.

రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం

కోనరావుపేట: రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని, సీసీఐ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో సుద్దాల శ్రీకావేరి కాటన్ ఇండస్ట్రీస్ సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగర్వాల్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు, కచ్చకాయల ఎల్లయ్య, రొండి రాజు వేములవాడ ఆర్డీవో రాధాభాయ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రకాష్, సీసీఐ సీపీఓ రఘురామ్ తహసీల్దార్, వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, ప్రజా ప్రతినిధులు కె.బాల్‌రెడ్డి, నాయిని ప్రభాకర్ రెడ్డి, సాసాల మల్లారెడ్డి, నీరటి సంజీవ్, ఎర్రవెల్లి నాగరాజు, కాశవేణి మహేష్, ముస్కు ముకుంద రెడ్డి, సుంకరి రెడ్డి, ఎస్.మహేష్, ఆవురం సురేష్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సుద్దాలలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమా అగర్వాల్

రూ.7150 పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

జమ్మికుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7150 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 150మందిరైతులు 1197క్వింటాళ్ల విడిపత్తి,తొమ్మిదిమంది రైతులు 12క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠధర రూ.7150, కనిష్ఠధర రూ.4800 చెల్లించి పత్తికొనుగోళ్ల చేపట్టారు. మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న -సదానందం, కార్యదర్శిమల్లేశం కొనుగోళ్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

సిగరెట్ ఇవ్వనన్నందుకు కత్తితో దాడి

కోల్‌సిటీ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మేకల మార్కెట్‌లో ముగ్గురు వ్యక్తులు తిరుపతి అనేవ్యక్తిపై కత్తితో దాడిచేశారు. డెకరేషన్ పనులుచేసే తిరుపతి, అతని స్నేహితుడు రవి పని ముగించుకుని ఇంటికి వెళుతూ మేకలమార్కెట్ సమీపంలో సిగరెట్ తాగుతుండగా అక్కడికి వచ్చిన సుందిళ్లకు చెందిన అశోక్, మేదరిబస్తీకిచెందిన అంజి, బాపూజీ నగర్‌కు చెందిన రోషన్‌లు తిరుపతి, రవిలను సిగరెట్ అడిగారు. తమ వద్ద అదనంగా సిగరెట్లు లేవని చెప్పడంతో మత్తులో ఉన్న ముగ్గురు యువకులు వారిపై కత్తితో దాడి చేయడంతో తిరుపతికి గాయాలయ్యాయి. బాధితుడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. బాధితుడు తిరుపతి ఫిర్యాదు మేరకు అశోక్, అంజి, రోషన్‌లపై కేసు నమోదు చేశామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

ముస్తాబాద్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దికుంట గ్రామంలోగల దొనుకుల భూదయ్య ఇంట్లో సోమవారం షార్ట్‌సర్క్యూట్ జరిగి ఇల్లు పాక్షికంగా దగ్ధమైంది. ఇంట్లోని విలువైన భూమి కాగితాలు, బట్టలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

పేద విద్యార్థులకు 'కార్పొరేట్' చేయూత



● ఉన్నత విద్యను అభ్యసించేందుకు స్కాలర్‌షిప్‌లు

చొప్పదండి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు కార్పొరేట్ కంపెనీలు, మల్టీనేషనల్ కంపెనీలు చేయూతను అందిస్తున్నాయి. విద్యార్హత, కుటుంబ ఆదాయం, నేపథ్యంతో ఎలాంటి పరీక్షలు లేకుండానే ప్రైవేట్ ప్లాట్‌ఫారాల ద్వారా నేరుగా విద్యార్థుల ఖాతాలకే స్కాలర్‌షిప్ అందజేస్తాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన కంపెనీలు అందజేస్తున్న స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల కోసం...

● ప్రైవేట్ ప్లాట్‌ఫారాల ద్వారా పంపిణీ...

2025-26 విద్యాసంవత్సరానికి అనేక కార్పొరేట్, మల్టీనేషనల్ కంపెనీలు స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందజేసేందుకు ప్రైవేట్ ప్లాట్‌ఫారాలను ఎంచుకుంటాయి. ప్రైవేట్ ప్లాట్‌ఫారాలు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి అర్హత, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించి స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేస్తాయి. నిర్దేశించిన స్కాలర్‌షిప్ మొత్తాన్ని విద్యార్థుల బ్యాంకు ఖాతాలోకి కంపెనీలు జమ చేస్తాయి. ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో విద్యార్థి దరఖాస్తు చేసుకుంటే ప్రైవేట్ ప్లాట్‌ఫారాలు ఎంపిక చేస్తాయి. ఎంపికైన విద్యార్థి నాలుగేళ్ల కోర్సు మొత్తం ప్రతి ఏటా స్కాలర్‌షిప్ అందుతుంది. ఇంటర్ నుంచి డిగ్రీ కోర్సులు, ఇంజనీరింగ్, మెడిసిన్, పీహెచ్‌డి విద్యార్థులకు 10 వేల నుంచి లక్ష, లక్షా యాభై వేల రూపాయలను అందజేసే కార్పొరేట్ కంపెనీలు ఉన్నాయి.

● బడ్డీ ఫర్ స్టడీ అనే సంస్థ ప్రైవేట్ ఇండిపెండెంట్ స్కాలర్‌షిప్ ప్లాట్‌ఫారం దేశంలోనే అతి పెద్దది. ఈ సంస్థ జాతీయ స్థాయిలో అనేక కార్పొరేట్, మల్టీనేషనల్, ఎన్‌జీవో కంపెనీల స్కాలర్‌షిప్‌ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను తీసుకొని స్కాలర్‌షిప్ అందజేస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎస్‌బీఐ, టాటా, హీరో, ఇండియా బుల్స్ లాంటి అనేక సంస్థలు స్కాలర్‌షిప్‌లు ఈ ప్లాట్‌ఫారం ద్వారా విద్యార్థులకు అందుతున్నాయి. స్కాలర్‌షిప్ ష్యూర్ మీ, స్కాలర్స్ బాక్స్ ద గ్లోబల్ స్కాలర్‌షిప్ లాంటి ప్రైవేట్ ప్లాట్‌ఫారాలు విద్యార్థులకు కార్పొరేట్ కంపెనీల స్కాలర్‌షిప్‌లను అందజేస్తుంటాయి. ఈ వేదికలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి ప్రాసెస్ చేసి కంపెనీల అనుమతి పొంది స్కాలర్‌షిప్‌లను అందజేస్తారు.

● బడ్డీ ఫర్ స్టడీ స్కాలర్‌షిప్‌లు...

- కాల్గెట్-పామోలోవ్, బీడీఎస్, ఎండీఎస్ విద్యార్థులకు 75 వేల రూపాయల స్కాలర్‌షిప్ అందజేస్తుంది. చివరితేది నవంబరు 9.
- కొటాక్ కన్యా ఇంజనీరింగ్, బీడీఎస్, ఎండీఎస్, ఎల్‌ఎల్‌బీ విద్యార్థినులకు 1.5 లక్షల రూపాయలు అందజేస్తుంది. చివరి తేది నవంబరు 15.
- సంతూర్ అండర్ గ్రాడ్యుయేట్ చదివే విద్యార్థినులకు 24 వేల నుంచి 30 వేల రూపాయల వరకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తుంది. చివరి తేది నవంబరు 16.
- మహీంద్ర సంస్థ 9-12వ తరగతి, డిగ్రీ చదువుతున్న వారికి సంవత్సరానికి 5,300 రూపాయల స్కాలర్‌షిప్ అందజేస్తుంది. చివరితేది నవంబరు 15.
- రోల్స్‌రాయిస్ సంస్థ ఇంజనీరింగ్ చదివే విద్యార్థినులకు 35 వేల రూపాయల స్కాలర్ షిప్ అందజేస్తుంది. చివరితేది నవంబరు 30.
- ఎరిక్సన్ సంస్థ ఇంజనీరింగ్ చదివే విద్యార్థినులకు 75 వేల రూపాయల స్కాలర్‌షిప్ అందజేస్తుంది. చివరితేది నవంబరు 30.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



కొమురయ్య(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రుక్మాపూర్‌కు చెందిన తాటికొండ కొమురయ్య(55) రాత్రి మృతిచెందినట్లు రూరల్‌సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. కొమురయ్య, అతడి భార్య నర్సవ్వ టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై కరీంనగర్ నుంచి నగునూర్‌కు వెళ్తున్నారు. ఎదురుగా చొప్పదండివైపు నుంచి వచ్చిన లారీ ఎక్స్‌ఎల్‌ను ఢీకొట్టింది. కొమురయ్య, నర్సవ్వ కింద పడడంతో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న కొమురయ్య రాత్రి 9గంటల ప్రాంతంలో మృతిచెందినట్లు సీఐ తెలిపారు. కొమురయ్య కుటుంబ సభ్యులు ఫిర్యాదుతో లారీ డ్రైవర్‌పై కేసునమోదు చేశామని, విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

● కుటుంబ సభ్యులపై కేసు నమోదు



సాయిసుప్రజ(ఫైల్)

ఇల్లందకుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సాయి సుప్రజ(25) సోమవారం మృతిచెందింది. ఈమేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండలోని గోపాల్‌పూర్‌కు చెందిన నిమ్మల శివశంకర్ రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి. ఇతనికి కూతురు సుప్రజ, కుమారుడు ఉన్నారు. సుప్రజను ఇల్లందకుంట మండలకేంద్రానికి చెందిన గొడిశాల విక్రమ్‌కు ఇచ్చి ఫిబ్రవరి 2, 2025లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో రూ.20లక్షల నగదుతో పాటు బంగారం పెట్టారు. పెళ్లైన రెండునెలల వరకు భార్యభర్తలు మంచిగా కలిసిమెలిసి ఉన్నారు. తర్వాత సాయిసుప్రజ భర్త విక్రమ్, అత్త పుష్ప అదనంగా బంగారం తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని సుప్రజ తల్లిదండ్రులకు తెలిపింది. శివశంకర్ అల్లుడిని, వియ్యపురాలిని అదనంగా డబ్బులు, బంగారం ఎందుకు అడుగుతున్నారని ప్రశ్నించాడు. అయినప్పటికీ వినకుండా అదనంగా బంగారం తీసుకురావాలని వేధించారు. ఈ విషయం సుప్రజ బాధపడుతూ దసరా పండుగకు వచ్చి తల్లిదండ్రులకు తెలిపి ఇంటి వద్దనే ఉంది. తల్లిదండ్రులు సుప్రజకు నచ్చజెప్పి అత్తగారి ఇంటికి పంపించారు. ఆదివారం సాయంత్రం సుప్రజ భర్త, తన బావమరిదికి ఫోన్‌చేసి మీ చెల్లెలు బాత్‌రూంలో పడిపోయిందని, జమ్మికుంట ఆస్పత్రికి తీసుకెళ్తున్నామని చెప్పాడు. తల్లిదండ్రులు వచ్చేసరికి సుప్రజ ప్రభుత్వాస్పత్రిలో చనిపోయి ఉంది. తన కూతురు మరణంలో తమకు అనుమానం ఉందని, తన కూతురు మరణానికి సుప్రజ భర్త విక్రమ్, అత్త పుష్ప కారణమని ఫిర్యాదు చేయగా, శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కెనాల్‌లో దూకి మహిళ ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంట ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్‌లో దూకి ఉయ్యాల అరుణ(53) ఆత్మహత్య చేసుకున్నట్లు కొత్తపల్లి సీఐ కోటేశ్వర్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. బోయినిపల్లి మండలం తడగొండకు చెందిన అరుణ ఆమె కొడుకు, ఇతర కుటుంబ సభ్యులు చింతకుంటలో కొంతకాలంగా నివాసం ఉంటున్నారు. మూడేళ్ల కిందట అరుణకు మూర్ఛవ్యాధి వచ్చి అనారోగ్యానికి గురైంది. అప్పటినుంచి మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తోంది. సోమవారం ఉదయం కనిపించకపోవడంతో పరిసరాల్లో వెతుకుతుండగా కెనాల్‌లోని నీటిలో అరుణ మృతదేహం లభించింది. జీవితంపై విరక్తిచెంది అరుణ ఆత్మహత్య చేసుకుందని ఆమె కుమారుడు రాజశేఖర్ ఫిర్యాదు చేసినట్లు, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గోదావరి నదిలో యువకుడి గల్లంతు

● రెస్క్యూ ఆపరేషన్, లభ్యం కాని ఆచూకీ

● ఆరా తీసిన మంత్రి శ్రీధర్‌బాబు, పుట్ట మధు



సాయికృష్ణ

మంథని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గోదావరి నదిలో స్థానిక పాత బస్టాండ్ ఏరియాకు చెందిన రావికంటి సాయికృష్ణ (30)అనే యువకుడు సోమవారం ఉదయం గల్లంతయ్యాడు. ఈత కోసం వెళ్లిన సాయికృష్ణ ప్రమాదవశాత్తు నీటి ప్రవాహంలో గల్లంతైనట్లు అక్కడే ఉన్న కొందరు చూసి సమాచారం ఇచ్చారు. దీంతో సాయికృష్ణ తండ్రి రావికంటి చందు నది వద్దకు వచ్చి చూడగా ఒడ్డున బ్యాగ్, షాట్, టీషర్టు, చెప్పులు, సెల్ ఫోన్ గుర్తించి ఆందోళనకు గురయ్యారు. పోలీసులకు, ఫైర్ సిబ్బంది సమాచారం ఇవ్వడంతో వారు నది వద్దకు వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలియడంతో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఫోన్‌లో చందుతో మాట్లాడి ధైర్యం చెప్పారు. గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో పోలీసు, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు నదిలో సాయంత్రం వరకు ఎయిర్‌బోట్‌లో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించినప్పటికి సాయికృష్ణ ఆచూకీ లభ్యం కాలేదు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు సైతం గోదావరినది తీరం వద్దకు చేరుకొని రావికంటి చందును ఓదార్చి అధికారులతో ఆరా తీశారు. సాయికృష్ణ గల్లంతుతో కుటుంబంలో విషాదం నెలకొంది.

అర్ధరాత్రి మట్టి అక్రమ రవాణా

● అడ్డుకున్న గ్రామస్థులు.. ● టిప్పర్‌లు పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



పోలీస్‌స్టేషన్‌లో టిప్పర్లు

గన్నేరువరం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామ శివారులోని వరదకాలువ మట్టిని ఆదివారం అర్ధరాత్రి టిప్పర్ల ద్వారా ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న పోలీసులు రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గుట్టు చప్పుడు కాకుండా కొందరు వ్యక్తులు అక్రమంగా రాత్రి సమయాల్లో మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు.. రాత్రిళ్లు టిప్పర్ల సౌండ్‌కు నిద్రపట్టక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతోనే మట్టిమాఫియా యథేచ్ఛగా అక్రమరవాణా కొనసాగిస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మట్టిని రవాణాచేస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టుకున్న టిప్పర్లను తదుపరి చర్యలకై మైనింగ్ శాఖ ఏడీకి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అత్తింటి వేధింపులతో వివాహిత ఆత్మహత్యాయత్నం

● కూతురి పరిస్థితి చూసి తట్టుకోలేక అదేబాటలో తండ్రి

● పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితుల ఆరోపణ

ఎల్లారెడ్డిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉన్నత కుటుంబం.. కెనడా సంబంధం.. తన కూతురు సంతోషంగా ఉంటుందని ఆశిస్తే వివాహమైన ఆరు నెలలకే అత్తింటి వేధింపులు అధికమయ్యాయి. దీంతో మనస్థాపంచెందిన వివాహిత ఆత్మహత్యాయత్నం చేయగా కూతురు పరిస్థితి చూసి చలించిన తండ్రి పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుడు ఆంజనేయులు కథనం మేరకు.. గ్రామంలోని ఆంజనేయులు కూతురు నిఖితను 11నెలల కిందట కెనడాలో ఉద్యోగం చేస్తున్న పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కుచెందిన కృష్ణకాంత్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. ఆరు నెలల పాటు నిఖితను బాగా చూసుకున్న అత్తింటివారు వేధింపులకు దిగారు. పెళ్లయిన మూడునెలలకు కృష్ణకాంత్ కెనడాకు బయలుదేరాడు. ఈ క్రమంలో నిఖిత ఐదు నెలల క్రితం పుట్టింటికి చేరుకుంది. పలుమార్లు పెద్దలు పంచాయతీ నిర్వహించి కలిసి మెలసి ఉండాలని సూచించారు. అత్తింటివారిలో మార్పు రాకపోవడంతో నిఖిత తన తండ్రి ఆంజనేయులుతో కలిసి 20 రోజుల క్రితం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. న్యాయం జరుగకపోవడంతో ఆమె నాలుగు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తన కూతురుకు న్యాయం చేయాలని పోలీసులకు వద్దకు వెళ్తే అత్తింటి వారికే వత్తాసు పలుకుతున్నారని నిఖిత తండ్రి ఆంజనేయులు ఈ నెల 1న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. న్యాయం చేయాల్సిన పోలీసులు అత్తింటి వారి వైపు అండగా నిలుస్తున్నారని ఆరోపించాడు. ఈ విషయంపై స్థానిక ఎస్‌ఐ రాహుల్‌రెడ్డిని వివరణ కోరగా వివాహిత నిఖిత ఫిర్యాదు మేరకు భర్త, అత్తమామలపై వరకట్నం కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. తాము ఎవరి పట్ల దురుసుగా వ్యవహరించలేమని చెప్పారు. తమపై వివాహిత నిఖిత తండ్రి ఆంజనేయులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వివరించారు.

వలకు చిక్కిన కొండచిలువ



వలలో ఉన్న కొండచిలువ

సుల్తానాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పెద్దచెరువు మత్తడి పైనుంచి నీళ్లతోపాటు చేపలు వెళ్లిపోకుండా ఉండేందుకు కాంట్రాక్టర్ ఒకవల అడ్డుగా ఏర్పాటు చేశాడు. సోమవారం ఉదయం కట్ట మీదుగా మత్తడిపై నుంచి వెళుతున్న వారు వలలో చిక్కుకుపోయిన కొండచిలువను గమనించారు. వెంటనే సమాచారం అందుకున్న ముదిరాజులు కొండచిలువతోపాటు వలను పక్కకు లాగారు. వలలో చిక్కుకొని ఉన్న కొండచిలువపై రాళ్లతోదాడి చేయడంతో చనిపోయింది. కొండచిలువ సుమారు పది మీటర్ల పొడవు ఉందని వారు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా కరీంనగర్ రూరల్ మండలంలో ఇసుక తరలిస్తున్న 3ట్రాక్టర్లను సోమవారం పట్టుకున్నట్లు రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ గ్రామ శివారులోని మానేరువాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సప్తగిరికాలనీకి చెందిన ఒకట్రాక్టర్‌ను పట్టుకున్నామని తెలిపారు. డ్రైవర్లు, యజమానులు ఆవుల కుమార్, మహ్మద్ ఇలాయాస్, అన్నమల్ల శ్రీనివాస్, మహ్మద్ ఇలాయాస్ ఖాన్, బొల్లం సంపత్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగిన వరద

జగిత్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం సోమవారం కొనసాగింది. ఎగువ ప్రాంతం నుంచి 56,513 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 16వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 47,059 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 56,513 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

ఓదెల మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి

ఓదెల మండలంలో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకోగా, చెరువులో పడి ఒకరు, అనారోగ్యంతో కాంగ్రెస్ నాయకుడు మృతిచెందారు. వివరాల్లోకి వెళితే..



మహేష్, ఆవుల రాజయ్య, రవీందర్ (ఫైల్)

ఓదెల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండుగ్రామాల్లో వేర్వేరు కారణాలతో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. మడకలో పిట్టల మహేష్ (23) అనే యువకుడు ఆదివారం రాత్రి కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు గమనించి సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇల్లంతకుంట మండలం సీతంపేటకు చెందిన పిట్టల వెంకటేశం ఉపాధి కోసం పదేళ్ల క్రితం మడకకు వచ్చారు. 12 ఎకరాలను కౌలుకు తీసుకొని జీవిస్తున్నాడు. వెంకటేశం కుమారుడు మహేష్ తండ్రికి ఆసరాగా ఉంటున్నాడు. కడుపు నొప్పి అధికం కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్‌ఐ దీకొండ రమేష్ తెలిపారు.

● మడకకు చెందిన ఆవుల పెద్ద రాజయ్య (72) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు ఊరచెరువులో జారిపడి మృతిచెందాడు. ఆదివారం బహిర్భూమికి వెళ్లిన రాజయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం చెరువులో వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు కొమరయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రమేష్ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● ఇందుర్తిలో ఆదివారం రాత్రి ఇందిరమ్మ కమిటీ సభ్యుడైన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగపూరి రవీందర్ (48) పచ్చకామెర్ల వల్ల మృతి చెందాడు. కొద్ది రోజుల నుంచి రవీందర్ పచ్చకామెర్ల వ్యాధితో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగిన కూడా నయం కాలేదు. ఇతని ఆరోగ్య పరిస్థితి మరింత విషమించడంతో సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

తెలంగాణలో మరో 6 నెలల పాటు కాల్పుల విరమణ

● రాష్ట్రంలో శాంతికి భంగం కలిగించేందుకు బీజేపీ కుట్ర ● మావోయిస్టు పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

మంథని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో మరో 6నెలలపాటు మావోయిస్టుపార్టీ కాల్పుల విరమణను ప్రకటించినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ వెల్లడించారు. ఈ మేరకు సోమవారం జగన్ పేరిట పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో శాంతియుత వాతావరణం కొనసాగాలని, ప్రజా సమస్యలను శాంతియుతమార్గంలో పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో ఈనిర్ణయం తీసుకున్నట్లు లేఖలో వెల్లడించారు. అయితే ప్రభుత్వవైఖరిని గమనిస్తూనే.. తమ శాంతిప్రక్రియను కొనసాగిస్తామని స్పష్టంచేశారు. అన్నిరాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, సామాజికవర్గాలు శాంతియుత వాతావరణం కొనసాగాలని చేసిన ఉద్యమాలు, ప్రజలఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించిన క్రమంలో తాము గత6నెలలపాటు కాల్పుల విరమణ ప్రకటించామన్నారు. తాము శాంతియుతంగా ఉంటామని, ప్రభుత్వ వైఖరి కూడా అలానే ఉండాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో కొనసాగుతున్న శాంతియుత వాతావరణాన్ని భంగం చేయటానికి ప్రయత్నం చేస్తుందని, దీన్ని అన్ని పార్టీలు, సామాజిక వర్గాలు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



గోదావరి నది వద్ద హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి వద్ద గోదావరి హారతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జరమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి నదివద్ద విశేషపూజలు నిర్వహించారు. రాత్రి మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. ఈ కార్యక్రమంలో ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, భక్తులు పాల్గొన్నారు.

కోటిలింగాలలో..

వెల్గటూర్: వెల్గటూర్ మండలం కోటిలింగాల వద్ద గోదావరి హారతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సంజీవ్ శర్మ, నాగరాజుశర్మల మంత్రోచ్చారణల మధ్య గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు భక్తితో కార్తీకదీపాలు గోదావరి నదిలో వదిలారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పూదరి రమేష్, పాల్గొన్నారు.

వృద్ధురాలి ఇంట్లో చొరబడి బంగారం దోపిడీ

గంగాధర, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధురాలి ఇంట్లో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి బంగారం దోచుకెళ్లిన ఘటన గంగాధర మండలం కొట్లనర్సింహులపల్లిలో కలకలం రేపింది. ఎస్సై వంశీకృష్ణ వివరాల ప్రకారం.. కొట్ల నర్సింహులపల్లిలో వెముజాల సత్తమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. ఆదివారం తనఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి అమ్మా, అమ్మా అని పిలిచాడు. లోపల నుంచి సత్తమ్మ ఎవ్వరని ఎదురు ప్రశ్నించగా ఎదుటివ్యక్తి తలుపుతీయమని అన్నాడు. ఎంతకీ పేరు చెప్పకపోవడంతో భయంతో తలుపు తీయలేదు. దీంతో ఆవ్యక్తి బలంగా తలుపును కొట్టడంతో గడిదెబ్బతిని తలుపులు తెరుచుకున్నాయి. మాస్క్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తి లోపలికి వెళ్లి వృద్ధురాలి మెడలోని రెండున్నర తులాల బంగారు పుస్తెల తాడును కత్తిరించి ఎత్తుకెళ్లాడు. అనంతరం బయటి నుంచి గడియపెట్టి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైవంశీకృష్ణ తెలిపారు.

వన్యప్రాణిని చంపిన నిందితుడి అరెస్ట్



నిందితుడిని అరెస్టు చేస్తున్న అధికారులు

కొడిమ్యాల, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): జింకను చంపిన కేసులో కొడిమ్యాల మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గుడికందుల ఆశయ్య అనేవ్యక్తిని సోమవారం అరెస్టుచేసినట్లు అటవీశాఖ కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్, డిప్యూటీరేంజర్ ముషీర్ అహ్మద్ తెలిపారు. ఆశయ్య కొడిమ్యాల అటవీశివారులో వన్యప్రాణులను పట్టుకోవటానికి విద్యుత్ తీగలను ఏర్పాటుచేసుకున్నాడు. అడవిలో జింక విద్యుత్‌తీగలకు తగిలి మృతి చెందింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు అడవిలో గాలించి జింక కళేబరాన్ని పట్టుకొని నిందితుడిపై కేసునమోదుచేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు అటవీఅధికారులు తెలిపారు. రేంజర్ వెంట కొడిమ్యాల బీట్ అధికారి ఆనందరావు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు



నారాయణ

కోనరావుపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన బద్దెపూరి నారాయణ(80) అనేవృద్ధుడు అదృశ్యమైనట్లు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బద్దెపూరి నారాయణకు మతిస్థిమితం సరిగా లేదన్నారు. గతంలో కూడా ఒకసారి ఇంట్లో నుంచి వెళ్లిపోయినప్పటికీ ఆచూకీ తెలుసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించామని అన్నారు. అక్టోబర్ 31న రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని కుమారుడు రమేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వ్యక్తులు కోనరావుపేట పోలీస్‌స్టేషన్ కు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరారు.

వ్యక్తి అదృశ్యం పై వీడని మిస్టరీ

రామగిరి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుధవారంపేట్‌లో కుమారస్వామి అనేవ్యక్తి అదృశ్యం మిస్టరీగా మారింది. సోమవారం తెల్లవారుజామున 3గంటల సమయంలో ఇంట్లోనుంచి కుమారస్వామి వెళ్ళినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి సమీపంలోని ఊరచెరువు సమీపంలోని వ్యవసాయ బావివద్ద కుమారస్వామికి చెందిన ద్విచక్రవాహనం, కళ్ల అద్దాలను గుర్తించారు. వ్యవసాయబావిలో గజఈత గాళ్లతో గాలింపు చేపట్టిన ఫలితం ఆచూకీలేదు. ప్రత్యామ్నాయంగా బావిలోని నీటిని మోటార్ల సహాయంతో తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.

కట్టు కాలువను పట్టించుకోరా..?

- భారీ వర్షం వచ్చిన ప్రతీసారి తెగుతున్న తుమ్మల చెరువు కట్టుకాలువ
- తెగిన ప్రతీసారి పంట నష్టపోతున్న రైతులు

సైదాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్కేపల్లి శివారులో గల తుమ్మల చెరువు కట్టుకాలువ భారీ వర్షం కురిసిన ప్రతీసారి తెగిపోతుంది. దీంతో కాలువ దిగువన ఉన్న వ్యవసాయ భూముల్లోకి వరద నీరు వచ్చి పంటలు కొట్టుకుపోతున్నాయి. కట్టు కాలువ తెగకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వెన్కేపల్లి శివారులోని తుమ్మల చెరువు మత్తడి నీరు అదే గ్రామ శివారు లోని పోల్కమ్మ చెరువులోకి వెళ్లేం దుకు చాలా ఏళ్ల క్రితం ఈ కట్టు కాలువను నిర్మించారు. అప్పుడు ఈ కట్టు కాలువ చాలా వెడల్పుగా ఉండి ఎంత వర్షం పడిన ఎలాంటి అడ్డంకులు లేకుండా నీరు పోల్కమ్మ చెరువులోకి వెళ్లేది. కాలక్రమేణా కట్టుకాలువ ఆక్రమణకు గురై వెడల్పు తగ్గింది. భారీ వర్షం కురిసినప్పుడు వరద నీరు కాలువలో భారీగా చేరి కట్టుకాలువ తెగుతోంది. తుమ్మల చెరువు మత్తడి పడే కట్టు కాలువ మొదటి బాగంలో కట్టు కాలువ వెడల్పుగా ఉంది. కానీ పోను పోను కొంత దూరం నుంచి వెడల్పు తగ్గడంతో కాలువలో నీరు పొంగి కట్టపై నుంచి ప్రవహించి కట్టు కాలువ కట్ట తెగిపోతుంది. దీంతో కింది రైతులకు తీరని నష్టం వాటిల్లుతుంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కట్టుకాలువ వెడల్పు, ఎత్తు పెంచి దృఢంగా నిర్మించాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.



భారీ వర్షానికి తెగిన తుమ్మల చెరువు కట్టుకాలువ కట్ట



అక్కడక్కడ కోతకు గురవుతున్న తుమ్మల చెరువు కట్టుకాలువ కట్ట

ఆరబోసిన ధాన్యంపై వానర దండయాత్ర



వడ్లను చిందరవందర చేస్తున్న కోతులు

గంభీరావుపేట, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): పంట వేసింది మొదలుకొని పైరు చేతికి వచ్చేదాక రైతన్న తిప్పలు అన్నీ ఇన్నీ కావు. పంటచేతికి వచ్చినా ధాన్యం అమ్మేదాక అష్టకష్టాలు పడాల్సిందే. అతివృష్టి, అనావృష్టితో నష్టాలను చవిచూసిన రైతన్నలు కోతుల బెడతో ఇబ్బందులు పడుతున్నారు. గంభీరావుపేట మండలంలో అన్నదాతలు ఆరబోసిన వడ్లకుప్పలను వానరాలు చిందరవందర చేస్తున్నాయి. గుంపులుగా వచ్చి తింటున్నాయి. గంభీరావుపేట నుంచి నర్మాల వెళ్లే దారిలో వడ్ల కుప్పలపై వానర గుంపు ఇలా దండుయాత్ర చేసింది.

ఉమ్మడి జిల్లా స్థాయి హాకీ ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్ తదితరులు

హుజూరాబాద్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో ఉమ్మడిజిల్లా స్థాయి అండర్-14,-17 బాల బాలికల హాకీ క్రీడా ఎంపికపోటీలను జిల్లా సెక్రెటరీ వేణుగోపాల్, హాకీ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు తోటరాజేంద్రప్రసాద్, ఎంఈవో శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 170మంది క్రీడాకారులు పాల్గొనగా, అందులో నుంచి అండర్-17,-14 బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేశామన్నారు. ఎంపికైన వారు వన పర్తిలో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాహాకీ ఎస్‌జీఎఫ్ కన్వీనర్ వేముల రవి కుమార్, సత్యానంద్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, అనిల్, శేఖర్, కొలిపాక శ్రీనివాస్, తాళ్లపల్లి శ్రీనివాస్, శ్యాంసుందర్, శంకర్, సజ్జు, సాయి కృష్ణ, రాకేష్, విక్రమ్, సాంబ, వంశీ, పరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన విద్యార్థి



వెయిట్ లిఫ్టింగ్ చేస్తున్న విద్యార్థి శ్రీనిత్

జమ్మికుంట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌లో నిర్వహించిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో జమ్మికుంట ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి కె సాయిశ్రీనిత్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. ఈసందర్భంగా శ్రీనిత్‌ను ప్రాధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ప్రాధానోపాధ్యాయుడు బాదం సురేష్ మాట్లాడుతూ బాలుర ఉన్నతపాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యతోపాటు ఆట,పాటల్లో సైతం చురుకుగా రాణి స్తున్నారని తెలిపారు. క్రీడానైపుణ్యాలు ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో కూడా విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో ద్వితీయ స్థానం

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ కళాశాలల అండర్-19 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో నిర్వహించిన ఫైనల్స్‌లో రంగారెడ్డి జట్టు విజయవం సాధించగా ఉమ్మడిజిల్లా జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా బాలికల జట్టును అండర్-19 ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బి.వేణుగోపాల్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు బి.సతీష్, ఎర్రం హరీష్, భవాని, నిరోషా, శ్రీవిద్య, లావణ్య అభినందించారు.



ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా కర్ర రాజశేఖర్

కరీంనగర్ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు చైర్మన్‌గా కర్ర రాజశేఖర్ ఎన్నికయ్యారు. సోమవారం చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం ఎన్నికల అధికారి, జగిత్యాల డీసీవో సీహెచ్ మనోజ్‌కుమార్ ఎన్నికలు నిర్వహించారు. 12మంది డైరెక్టర్లలో కర్ర రాజశేఖర్ మాత్రమే చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో కర్ర రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్ ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. వైస్‌చైర్మన్ పదవికి ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. దీంతో వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదాపడింది. వైస్ చైర్మన్ పదవిని సీనియర్ డైరెక్టర్లు బాశెట్టి కిషన్, వరాల జ్యోతి, బొమ్మరాతి సాయికృష్ణ, దేశవేదాద్రి, కన్న సాయి ఆశిస్తున్నట్లు తెలిసింది. వైస్ చైర్మన్ పదవికి పోటీ ఎక్కువగా ఉండడంతో అందరితో సమావేశమై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చించిన అనంతరం ఏకగ్రీవం చేసేందుకు చైర్మన్ రాజశేఖర్ ఆలోచిస్తున్నట్లు సమాచారం.

- వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా

- హ్యాట్రిక్ చైర్మన్‌గా రికార్డు..

1996లో మొదటిసారి బ్యాంకు డైరెక్టర్‌గా ఎన్నికైన రాజశేఖర్, 2001, 2003లో వరుసగా మూడోసారి డైరెక్టర్‌గా ఎన్నికై బ్యాంకు వైస్‌చైర్మన్ పదవిని దక్కించుకున్నారు. 2007లో చైర్మన్‌గా ఎన్నికైన ఆయన 2012లో రెండోసారి చైర్మన్ బాధ్యతలను స్వీకరించి 2017వరకు ఆ పదవిలో కొనసాగారు. ఇక అప్పటి నుంచి ఇప్పటి వరకు వివిధ కోర్టు కేసుల కారణంగా బ్యాంకు పాలక వర్గ ఎన్నికలు జరుగలేదు. కోర్టు ఆదేశాలతో ఎని మిదన్నరేళ్ల తర్వాత గత శనివారం నిర్వహించిన బ్యాంకు పాలకవర్గ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ప్యానల్ చైర్మన్‌గా బరిలో నిలిచి 9మంది డైరెక్టర్లను గెలిపించు కున్నారు. రాజశేఖర్‌కు మరోప్యానల్ నుంచి ఎన్నికైనఇద్దరు,ఒక ఇండిపెండెంట్ డైరెక్టర్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు దీనితో రాజశేఖర్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా మూడోసారి ఎన్నికయ్యారు. అనంతరం జగిత్యాల డీసీవో, ఎన్నికల ఇన్‌చార్జి సీహెచ్ మనోజ్‌కుమార్ సమక్షంలో కర్ర రాజశేఖర్ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించారు.

- బ్యాంకును మరింత లాభాల్లోకి తీసుకెళతాం..

చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన కర్ర రాజశేఖర్ మీడియాతో మాట్లాడుతూ ఐదు సార్లు డైరెక్టర్‌గా, మూడోసారి చైర్మన్‌గా తనపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన బ్యాంకు సభ్యులకు, డైరెక్టర్లకు, సహకరించిన నాయకులు, ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. 2007నుంచి 2017 వరకు పదేళ్లు చైర్మన్‌గా బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో కృషి చేశామని చెప్పారు. 25కోట్ల డిపాజిట్లను పదేళ్లలో 60 కోట్లకు తీసుకెళ్ళామని, 2017 తర్వాత బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు జరుగక పోవడంతో ఎనిమిదిన్నరేళ్లలో డిపాజిట్లు 8.5కోట్లు మాత్రమే పెరిగాయన్నారు. పాలకవర్గం ఉంటేనే ప్రజలకు సహకార బ్యాంకులపై నమ్మకం ఉంటుందన్నారు.

డిపాజిట్లను 200 కోట్లకు పెంచడంతో పాటు డిపాజిట్ నిధులను ప్రస్తుతం ఇస్తున్న మార్టిగేజ్, గోల్డ్‌లోన్‌లతోపాటు వెహికిల్ లోన్స్, క్రెడిట్ కార్డులు, ఉద్యోగులకు పర్సనల్ లోన్స్, ఆర్‌బీఐ నిబంధనల మేరకు భద్రతతో కూడిన రుణాలను ఇస్తామన్నారు. వాటిని సక్రమంగా వసూలు చేసి బ్యాంకును మరింత లాభాల్లోకి తీసుకెళ్లేందుకు తమ పాలకవర్గం సమష్టిగా కృషి చేస్తుందని చెప్పారు. బ్యాంకులో పారదర్శకతతో నైపుణ్యత కలిగిన ఉద్యోగులను నియమించుకోవడంతోపాటు జమ్మికుంట, హుస్నాబాద్‌తో పాటు మరో మూడునాలుగు కొత్త బ్రాంచీలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్‌బీఐ నిబంధనల మేరకు బ్యాంకు అభివృద్ధికి కృషిచేస్తున్న ఉద్యోగుల వేతనాల పెంపునకు పాలకవర్గం చర్యలు తీసుకుంటుందని ప్రకటించారు.

2007 నుంచి 17 వరకు పదేళ్లలో తమ పాలకవర్గం పారదర్శకంగా ఖాతాదారులు, సభ్యులకు సేవలందించిందని తెలిపారు.సమావేశంలో డైరెక్టర్లు వరాల జ్యోతి, ముద్దసాని శ్వేతక్రాంతి, సరిళ్ల రతన్ ప్రసాద్, బొమ్మరాతి సాయికృష్ణ, దేశ వేదాద్రి, కన్న సాయి, బాశెట్టి కిషన్, బండి ప్రశాంత్‌దీపక్, అనరాసు కుమార్, తాడ వీరారెడ్డి, ఉయ్యాల ఆనందం పాల్గొన్నారు.



తొలి సంతకం చేసి పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్

ధర్మపురి ఆలయాన్ని.. సమగ్రంగా అభివృద్ధి చేస్తాం

- గోదావరి పుష్కరాల కోసం ఏర్పాట్లు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



సమావేశంలో పాల్గొన్న మంత్రులు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కొండా సురేఖ

ధర్మపురి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ మాస్టర్ ప్లాన్‌పై హైదరాబాద్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్. వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి పనులు ఆగమ శాస్త్రం, వేదపండితులు, స్థానికులు, భక్తుల మనోభావాలకు అనుగుణంగా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాల కోసం శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయడానికి అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ధర్మపురి తీరం వెంట ఉన్న ఆలయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె ఆదేశించారు. పుష్కర స్నానాల కోసం వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కొండా సురేఖ తెలిపారు. మాస్టర్ ప్లాన్‌కు అవసరమైన స్థల సేకరణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.50 కోట్లతో చేపట్టే నిర్మాణపనుల్లో నాణ్యత పాటించాలని ఆమె ఆదేశించారు. రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరిలక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో గోదావరిపుష్కరాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. ధర్మపురి ఆలయాన్ని విస్తృతంగా అభివృద్ధి చేస్తున్న దేవాదాయ మంత్రి కొండా సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాస్టర్ ప్లాన్, గోదావరి పుష్కరాల కోసం రూ.50కోట్ల ప్రతిపాదిత అభివృద్ధి పనుల గురించి ఆయన వివరించారు. సమావేశంలో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, ఎండోమెంట్ డైరెక్టర్ హరీష్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు అధికారులు, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురికి జైలు శిక్ష

కోల్‌సిటీ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మద్యంసేవించి వాహనాలు నడుపుతూ రెండో సారి పట్టుబడిన ఇద్దరువ్యక్తులకు సోమవారం గోదావరిఖని కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్టు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 15మందిని సోమ వారం సెకండ్ అడిషనల్ మెజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ఎదుట హాజరుపర్చగా 13మందికి రూ.27 వేల జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధించినట్టు ఆయన పేర్కొన్నారు.

జగిత్యాలటౌన్: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి 10రోజుల జైలు శిక్ష విధిస్తూ స్పెషల్ జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గంప కరుణాకర్ తీర్పునిచ్చారు. గొల్లపెల్లి ఎస్‌ఐ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాలప్రకారం వెల్గటూర్ మండలం జగదేవ్‌పేటకు చెందిన ఒల్లెపు సమ్మయ్య అతిగామద్యం సేవించి వాహనం నడిపినందుకు అతడిపై కేసు నమోదు చేయగా న్యాయమూర్తి 10 రోజుల జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ఎస్‌ఐ సూచించారు.

భర్త మృతిని తట్టుకోలేక భార్య బలవన్మరణం



పద్మ(ఫైల్)

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భర్త మృతిని తట్టుకో లేక దేవోళ్ల పద్మ(29) అనే వివాహిత బలవన్మరణం చెందిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో సోమవారం చోటుచేసు కుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని పద్మ- హన్మంతు దంపతులు కూలీ పనులు చేస్తూ ఇద్దరు కూతుళ్ల హిందు, ప్రత్యూషను స్థానిక ప్రభుత్వ బడిలో చదివిస్తున్నారు. స్థానికంగా ఉపాధిలేక హన్మంతు యేడాదిన్నర క్రితం రూ.6లక్షల అప్పు చేసి బహ్రెయిన్ దేశానికి పయనమయ్యాడు. సెప్టెంబరు26న అక్కడ గుండెపోటుతో మృతిచెందాడు. అదేనెల30న ఆయన మృతిదేహం ఇల్లు చేరింది. అంత్యక్రియలు పూర్తయిన నుంచి పద్మ దిగాలుగా ఉంటోంది. పిల్లలు స్కూల్‌కి వెళ్లిన తరవాత ఇంట్లో ఒంటరిగా ఉన్న పద్మ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. 40రోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతచెండంతో గ్రామంలో విషాదం అలుముకుంది. తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందడంతో వీరి ఇద్దరు కూతుళ్లు అనాథలుగా మారారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రాజన్న సన్నిధిలో భక్తజన సందోహం

- కోడెమొక్కులు చెల్లించిన భక్తులు
- స్వామివారి దర్శనానికి నాలుగు గంటల సమయం

వేములవాడ టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో భక్తుల రద్దీ ఏర్పడింది. రెండో కార్తీకసోమవారం సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయంలో విస్తరణ పనులు కొనసాగుతున్న సందర్భంగా రాజన్నఆలయంలో కేవలం లఘుదర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. భీమేశ్వరాలయంలో భక్తులు ఆర్జిత సేవలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో సాయంత్రం 6గంటల వరకు 4,680మంది దంపతులు కోడెమొక్కులు చెల్లించి ఆర్జితసేవలు నిర్వహించారు. రాజన్న సన్నిదిలో దర్శనానికి దాదాపు నాలుగు గంటలు పట్టింది.



రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



గోదావరి నదిలో కార్తీక స్నానాలు చేస్తున్న భక్తులు

వైభవంగా రుద్రాభిషేకం..

కార్తీక రెండోసోమవారం సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరస్వామివారికి ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతలకు అర్చనలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి మహా లింగార్చన పూజను వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం ఎదుట మహిళలు కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రపత్తిని చాటారు.

కార్తీక పౌర్ణమికి ముస్తాబు

భీమేశ్వరాలయంలో ఈనెల 5న కార్తీకపౌర్ణమి సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం 6గంటలకు భీమేశ్వరస్వామివారికి, భీమేశ్వర సదన్ పరిసర ప్రాంతంలో దీపారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కల్యాణం టిక్కెట్ల వద్ద భక్తుల తోపులాట

రాజరాజేశ్వరస్వామి కల్యాణం టికెట్ల కోసం భక్తుల మధ్య తోపులాట ఏర్పడింది. పార్వతీపురం నిత్యాన్న సత్రం పైభాగంలో రాజన్న నిత్యకల్యా ణాన్ని నిర్వ హిస్తున్నారు. ఇందుకు గతంలో 150టికెట్లు జారీచేసేది. హాలు చిన్నగా ఉండడంతో ప్రస్తుతం ఆ టికెట్ల సంఖ్య 60కి కుదించారు. కార్తీక మాసం కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. బుకింగ్ కౌంటర్ వద్ద క్యూలో ఉన్న భక్తుల తోపులాట కారణంగా క్యూలైన్ పక్కకు ఒరిగిపోయింది. కౌంటర్‌బోర్డు విరిగి కిందపడింది. బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తున్నట్లు భక్తులు ఆందోళన చేస్తూ గొడవకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న భద్రతా సిబ్బంది, పోలీసులు అక్కడికి చేరుకొని భక్తులను సముదా యించడంతో గొడవ సద్దుమనిగింది. చివరికి శాశ్వత కల్యాణాలతో కలిపి 89 టికెట్లను కేటాయించారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల పూజలు

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో సోమవారం కార్తీక సందడి నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా భారీగా భక్తులు తరలివచ్చారు. దీంతో లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వ స్వామి, శ్రీఅక్కపెల్లి రాజ రాజేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరినదిలో భక్తులు కార్తీక స్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనెపోసి భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో అర్చకులు, సిబ్బంది తగు సేవలు అందించారు.

మత్స్య కార్మిక కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం



మల్కపేట రిజర్వాయర్‌లో చేపలను వదులుతున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమా అగర్వాల్, నాయకులు

కోనరావుపేట, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మత్స్య కార్మిక కుటుంబాల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో మల్కపేట రిజర్వాయర్‌లో ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మత్స్యకారులకు 100 సబ్సిడీతో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహిస్తున్నారని తెలిపారు. చేపలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని 456 చెరువుల్లో రూ. కోటి 78 లక్షల విలువైన 1 కోటి 48 లక్షల చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నిర్వహించనున్నామని తెలిపారు. మల్కపేట రిజర్వాయర్లో మొత్తం 7 లక్షల 50 వేల చేపపిల్లలు పోసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు కేజ్ కల్చర్, ఇతర విధానాలు అమలు చేస్తామని వివరించారు. మల్కపేట రిజర్వాయర్ పనులను పూర్తి చేసి ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట మండలంలోని గ్రామాల పొలాలకు సాగు నీరు విడుదల చేశామని గుర్తు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. 100 శాతం సబ్సిడీతో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని చెరువుల్లో వచ్చే 10 రోజుల్లోగా చేప పిల్లలను విడుదల చేస్తామని అన్నారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిశోర్ కుమార్, డీఏఓ అఫ్జల్ బేగం, కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిత్య జాతీయ పతాకావిష్కరణ ఒక వినూత్నం



జాతీయగీతంతో ఉన్న చీరను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నిత్య జాతీయ పతాకావిష్కరణ ఒక వినూత్నం అని చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 100వ రోజు నిత్య జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాడు. అనంతరం తాను నేసిన భారత దేశ చిత్రపటం జాతీయ గీతం, రాష్ట్రపతితో ప్రముఖులతో కూడిన నేసిన వస్త్రాలను, చీరలను విద్యార్థుల ఎదుట కళాశాల ప్రిన్సిపల్ కనక శ్రీ విజయ రఘునందన్‌తో ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా చేనేత కళాకారుడు హరిప్ర సాద్ మాట్లాడారు. జాతీయ పతాకం ఆవిష్కరణ మాన్యులకే కాకుండా సామాన్యులకు కూడా అవకాశం కల్పిస్తూ నిత్య జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం అభినందనీయం అన్నారు. విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందించడంలో ఇదొక వినూత్న కార్యక్రమం అన్నారు.

కమనీయం.. వేణుగోపాలస్వామి కల్యాణం



స్వామి వారి ఎదుర్కోళ్లలో పాల్గొన్న భక్తులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో అత్యంత కీలక ఘట్టమైన స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు నవీన్‌చార్యులు, గోపాలచార్యులు, వెంకటచార్యులు, నర్సింహాచార్యులు, లక్ష్మణాచార్యులు, హర్షిత్‌కుమార్‌ఆచార్యులు, దయానంద్‌శర్మ, హన్మండ్లుశర్మ ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను మంత్రోచ్ఛరణల నడుమ వేదిక వద్దకు తీసుకెళ్లి పీఠంపై ప్రతిష్ఠించారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య శ్రీ వేణుగోపాలస్వామి, రుక్మిణి, సత్యభామ కల్యాణ మహోత్సవాన్ని రమణీయంగా జరిపించారు. స్థానిక అశ్విని ఆసుపత్రి నిర్వాహకులు, ప్రముఖ వైద్యులు సత్యనారాయణస్వామి అన్నదానం నిర్వహించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి

రుద్రంగి, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండలంలోని మానాల గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ కోఆపరేటివ్ యూనియాన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలను మానాలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను ఏర్పాటు చేయాలని రైతులు కోరిన వేంటనే గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను ప్రారంభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తురన్నారు. మద్దతు ధర రూ. 2400 ఉంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూం జలపతి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి, కోమ్ముల రవిందర్, జక్కు మోహన్, జక్కుల లక్ష్మీనారాయణ, జక్కు వంశీ, అల్లూరి తిరుపతి, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీ

ఎల్లారెడ్డిపేట, నవంబరు3(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట తాజా, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు సోమవారం మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. తన కుమారుడు అఖిల్‌రావు పెళ్లి ఈ నెల 8న జరుగనుండగా వివాహ ఆహ్వాన పత్రికను కేసీఆర్‌కు అందజేశారు. పెళ్లికి హాజరు కావాలని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌ను కలిసి పత్రికను అందించారు.

ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



ప్రజావాణిలో సమస్యలను వింటున్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్



కలెక్టరేట్‌కు వచ్చిన గంగపుత్ర మత్స్యకారుల సంఘం నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలి రావడంతో కలెక్టరేట్ కిటకిటలాడిపోయింది. ప్రజలు జిల్లా ఇన్ చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో పాటు అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా అధికారులను కలిసి సమస్యలను విన్నవించి ఫిర్యాదులను అందించారు. ఈ ప్రజావాణిలో 149 ఫిర్యాదుల వచ్చాయి. ఇందులో రెవెన్యూకు 58, డీఆర్‌డీవోకు 20, హౌజింగ్‌కు 14, ఎస్డీసీకి 11, డీపీవోకు 7, డీఈవోకు 6, జిల్లా వైద్యాధికారికి 5,సెస్‌కు , సిరిసిల్ల మున్సిపాల్టికి 3, ఉపాధి కల్పన అధికారికి 3, డీసీఎస్‌వోకు 2, ఎక్సైజ్‌కు 2, డీసీవోకు 1, పారెస్ట్‌కు 1, రిజిస్ట్రార్‌కు 1, డీఎస్సీడీవోకు 1, డీవిహెచ్‌వోకు , ఆర్టీసీ డీఎంకు 1, జిల్లా సంక్షేమాధికారి 1, అర్అడ్‌బీకి 1, ఇరిగేష్‌కు1, ఎల్‌డీఎంకు 1 చొప్పున వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదులను ఎన్ని పరిష్కారించారనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని స్పష్టం చేశారు. మండలాల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఇతర అభివృద్ధి పనులను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. ఈ ప్రజావాణిలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత,డీఆర్‌డీవో శేషాద్రి, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, ఆర్డీవో రాధాబాయ్ పాల్గొన్నారు.

మానేరు కరకట్టను శుభ్రం చేయండి

సిరిసిల్ల మానేరు వంతెనకు ఆనుకుని నిర్మించిన కరకట్టను శుభ్రం చేయాలంటూ సిరిసిల్ల మిడ్‌మానేరు గంగపుత్ర మత్స్యకారుల సంఘం నాయకులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర గరిమా అగర్వాల్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గడప కృష్ణహరి, ఇటుకల రాజనర్సు, ఇటిక్యాల మహేందర్, పందిరి సత్యనారాయణ, చిట్లాపురం శ్రీనివాస్, గడప లక్ష్మణ్, గడప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం గ్రామకార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

కోనరావుపేట మండలం నాగారం గ్రామ కార్యదర్శి ఎండి అస్సానా బేగం హిందువుల మనోభావాలను వ్యతిరేకంగా విధులు నిర్వహిస్తున్నారని చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. దీపావళి పండుగ సందర్భంగా గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పోటీగుట్టపై కాషాయ జెండాపూజ నిర్వహించి జెండాను ప్రతిష్ఠించడం జరిగిందని గ్రామకార్యదర్శి ఆ జెండాను తొలగించారన్నారు. గ్రామకార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ గోపాడి సురేందర్‌రావు, కృష్ణ , శ్రీనివాస్ కోరారు.

మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- కడుదుల మల్లయ్య, రుక్కమ్మ , నీలోజిపల్లి



పిల్లలు లేని మా దంపతులను వృద్ధాప్యంలో పోషి స్తారని నమ్మి మా ఆస్తిని మా చెల్లెలు కుమారులకు ఇచ్చామని వారు ఇప్పుడు మమ్మల్ని ఇబ్బందుకు గురిచేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ బోయినపల్లి మండలం నీలోజిపల్లి గ్రామానికి చెందిన కడుదుల మల్లయ్య, రుక్కవ్వ దంపతులు కలెలక్టర్‌కు విన్నవించారు.

వైన్స్ ఫర్ సేల్

(5వ పేజీ తరువాయి)

సంబంధించి జిల్లాలో 1,381 దరఖాస్తులు వచ్చాయి. దీని ద్వారా రూ. 41.43 కోట్ల ఆదాయం ముందుగానే సమ కూరింది. ఆరు స్లాబ్‌లో లైసెన్స్ ట్యాక్స్ వసూల్ చేస్తారు. 5 వేల జనాభా ఉన్న ప్రాంతాలకు లైసెన్స్ టాక్స్ రూ. 50 లక్షలు, 5 నుంచి 50 వేల వరకు జనాభా ఉంటే రూ. 55 లక్షలు, 50 వేల నుంచి లక్ష జనాభా వరకు రూ. 60 లక్షలు, లక్ష నుంచి 5 లక్షల వరకు జనాభా ఉంటే రూ. 65లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల వరకు రూ.85 లక్షల ట్యాక్స్ వసూలు చేస్తారు. 20 లక్షల పైన జనాభా ఉంటే రూ. 1.10 కోట్లు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది.

తహసీల్దార్‌కు వినతి

గంభీరావుపేట, నవంబరు 03 (ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గంభీరావుపేట తహసీల్దార్ మారుతిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. విద్యా, ఉద్యోగాల్లో, స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ 9వ షెడ్యూలు చేయాలని, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని తహల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీఎస్సీఎస్టీ రాజ్యాధికార జేఏసీ మండల కన్వీనర్ సతీష్ మహారాజ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు కృష్ణకాంత్‌యాదవ్, నాయకులు పాక మహేష్, నారాయణయాదవ్, దేవేందర్ ముదిరాజ్, దేవయ్య, నర్సింలు ఉన్నారు.

పశువులకు టీకాలు

చందుర్తి, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్య అధికారి అభిలాష్ రైతులకు సూచించారు. లింగంపేటలో సోమవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ మౌనిక ఉన్నారు.

తేమ పేరిట రైస్ మిల్లులో కోతపై రైతుల ఆగ్రహం



డీఎస్‌వో చంద్రప్రకాశ్‌తో వాగ్వాదానికి దిగిన రైతులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలించిన నిర్వాహకులు తూకం వేసి రైస్ మిల్లుకు తరలిస్తే తేమ అధికంగా ఉందని కోతకు అంగీకరిస్తేనే ధాన్యం లోడు దింపుకుంటామని రైసు మిల్లు యాజమాన్యం పేర్కొనడంతో వారం రోజుల పాటు పడిగాపులు కాసిన అన్నదాతలు సోమవారం ఆందోళనకు దిగారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని రైతులు నేముల ఆదిరెడ్డి, గెంటి దేవయ్య, మేడిశెట్టి మల్లయ్యలకు చెందిన ధాన్యాన్ని ఐకేపీ నిర్వాహకులు వారం రోజుల క్రితం తూకం వేశారు. 988 ధాన్యం బస్తాలను లారీలో లోడు చేసి మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారులోని శ్రీ రాజరాజేశ్వర ఇండ్రసీస్‌కు తరలించారు. తేమ శాతం అధికంగా ఉందని పేర్కొంటూ మిల్లర్లు లారీలోని ధాన్యంలో 15 క్వింటాళ్ల కోత విధిస్తామని స్పష్టం చేశారు. అందుకు రైతులు అంగీకరించక పోవడంతో వారం రోజుల నుంచి లారీలోనే ధాన్యం ఉంచారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోవడంతో సహనం కోల్పోయిన రైతులు రైస్ మిల్లుకు చేరుకుని ధాన్యం లోడుతో ఉన్న లారీని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధాన్యం పోసి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. సుమారు రెండు గంటల పాటు ఆందోళనకు దిగారు. ఇరువైపులా రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న డీఎస్‌వో చంద్రప్రకాశ్ ఘటన స్థలానికి చేరుకున్నారు. రైతులను శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. తేమ పరిశీలన పరికరం తీసుకు వచ్చి చూడాలని పేర్కొన్నారు. వారం రోజులైనా రైస్ మిల్లరు ఎందుకు ధాన్యం దింపుకోరంటూ వాగ్వివాదానికి దిగారు. సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో చంద్రప్రకాశ్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాల్లో రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కోత విధిస్తున్న రైస్ మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు ధాన్యం తరలింపు, దిగుమతిలో జాప్యం చోటు చేసుకోకుండా చూస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి జాతర

- నేడు స్వామివారి కల్యాణం



విద్యుత్ వెలుగుల్లో ప్రధాన ద్వారం

రుద్రంగి, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ప్రహ్లద పర్వతంపై వెలసిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవంలో భాగంగా ఆలయం విద్యుత్ కాంతులతో ముస్తాబైంది. మంగళవారం శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం వైభవంగా జరుగనున్నది. గురువారం రథోత్సవం ఉంటుంది.

లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి పుష్పలత

వేములవాడ టౌన్ , నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కోర్టులో ఈనెల 15న ఏర్పాటు చేసే స్పెషల్ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగంచేసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఇంచార్జి చైర్మెన్ పుష్పలత అన్నారు. సోమవారం సాయంత్రం వేములవాడ జూనియర్ సివిల్ కోర్టు హాలులో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్‌పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ జిల్లాలో పెండెన్సీని తగ్గించడానికి పోలీస్, జ్యూడిషియల్ , న్యాయవాదుల మధ్య సమన్వయం ఉండాలన్నారు. రాజీ చేయబడే కేసులను గుర్తించి లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే విధంగా చొరవచూపాలన్నారు. రాజీయే రాజమార్గమని కక్షిదారులకు దిశానిర్దేశం చేయాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. వేములవాడ సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో రాజీ అయ్యే సివిల్ , క్రిమినల్ కేసులను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. ఈ స్పెషల్ లోక్ అదాల త్‌లో కనీసం 1500కేసులను పరిష్కరించేందుకు తోడ్పడాలన్నారు. ఈ సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రాధికా జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్ జాదవ్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ఏపిపిలు విక్రాంత్, అవదూత రజనీకాంత్, ఏజిపి బొడ్డు ప్రశాంత్, సిబిలు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్‌హెచ్‌ఓలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

'ఆది' అభిమాని సంబరం

- బాలయ్యకు మోపెడ్ గిఫ్ట్

వేములవాడ, నవంబరు 3 (ఆంధ్ర జ్యోతి) : ఎన్నో యేళ్లుగా తన కూరగాయల బండికి ఆది శ్రీనివాస్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేసిన అభిమాని సోమవారం సంబరపడ్డాడు. వేములవాడ పట్టణం నాంపల్లికి చెందిన కదురు బాలయ్య అనే వ్యక్తి ఆది శ్రీనివాస్‌పై తనకున్న అభిమానంతో ద్విచక్రవాహనం (ఎక్సెల్)కు మైక్ సెట్ ఏర్పాటు చేసి ఆది శ్రీనివాస్‌కు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించాడు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎన్నికల్లో గెలుపొందడంతో బాలయ్యకు ఎక్సెల్‌ను బహుమతిగా అందజేశారు. ఆది శ్రీనివాస్‌ను తన మోపెడ్ ఎక్కించుకుని బాలయ్య ఆనందంతో చక్కర్లు కొట్టాడు.

రోడ్డు మరమ్మతు చేయండి

చందుర్తి నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే దారికి మరమ్మత్తుపనులు చేపట్టాలని సోమవారం గ్రామ గౌడ సంఘం నాయకులు గ్రామ కార్యదర్శి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి 5సవత్సరాలకి ఒకసారి నిర్వహించే ఎల్లను బోనాల పండగ జనవరి 2026లో నిర్వహిస్తామన్నారు. అందులో బాగంగా గుడివద్దకు వెళ్లే దారి గుంతల మయంగా మారిందని, చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలోని వెంగల చెరువు మత్తడి నుంచి ఎల్లమ్మ గుడి వరకు రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా ఉందన్నారు. గుడికి వెళ్లేందుకు రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్,గంగాధర్, శేఖర్, సాయిరాం, నాగరాజు, రమేష్, గంగాధర్, కూచాద్రి, శ్రీనివాస్ ,అంజయ్య, వినయ్, బాలేశం పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులు, వృద్ధుల శిబిరం

- అర్హులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఇల్లంతకుంట, నవంబరు 3(ఆంధ్రజ్యోతి) మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం జరిగే దివ్యాంగుల, వృద్ధుల శిబిరంలో అర్హులైన వారు పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీఎం లతామంగేశ్వరి ఒక ప్రకటనలో కోరారు. అలింకో సంస్థ ద్వారా అర్హులైన దివ్యాంగులకు బ్యాటరీ ఆపరేటర్ సైకిల్స్ వీల్‌చైర్స్, వయోవృద్ధులకు చేతికర్రలు, మోకాలు పట్టీలు ఇవ్వడానికి అర్హులైన వారిద్వారా వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. అన్ని గ్రామాలకు చెందిన వారు శిబిరంలో పాల్గొనాలని కోరారు..

వేములవాడలో ఘనంగా కార్తీక దీపోత్సవం



సామూహిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



దీపాలంకరణ చేస్తున్న మహిళలు

వేములవాడ టౌన్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ భీమేశ్వరాలయంలో సోమవారం రాత్రి సుహాసినిలచే భక్తి శ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. సామూహిక దీపోత్సవంలో పాల్గొన్న వారికి వాయనం పసుపు కుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తిగీతాలు, భజనలు భక్తులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రావణ్‌కుమార్, ఆలయ అర్చకుడు గొపన్నగారి రాము, ఉద్యోగులు పురాణం వంశీ, మోహనశర్మ, మంద స్వామి, సురేష్ పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

- రేపు కార్తీక పౌర్ణమి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని దేవాలయాలన్నీ కార్తీక శోభతో వెలిగిపోనున్నాయి. ఈ సందర్భంగా ప్రతి ఇంట్లో తులసి సన్నిధిలో, దేవాయాలల్లో దీపాన్ని వెలిగించిన వారికి ఐశ్వర్య సిద్ధి కలుగుతుందని నమ్మకంతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా ఉసిరి కాయపై దీపాలు పెట్టి వెలిగించడం శుభాలను ఇస్తుందని శివార్చన చేసిన వారికి ఎలాంటి దోషాలు ఉండవని భావిస్తారు. అందుకే దక్షిణ భారత దేశంలో కార్తీక పూర్ణిమకు బహుళ ప్రాచుర్యం పొందిన పండుగ. తమిళనాడులోని అరుణాచలంలో కొండమీద దీప స్తంభంలో వెలిగించే జ్యోతిని దర్శించడానికి వేలాది మంది భక్తులు తరలి వెళ్తారు. కార్తీక పూర్ణిమ సందర్భంగా సత్యనారాయణస్వామి వ్రతాలు, నోములు నిర్వహించుకుంటారు. తులసి పూజలు నిర్వహిస్తారు. వేములవాడలో శ్రీరాజరాజేశ్వర దేవస్థానంలో జ్వాలా తోరణం, మహాపూజ నిర్వహిస్తారు.సిరిసిల్లలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

దీపాతోరణోత్సవం

దేవుని ముందు దీపం వెలిగించడంలో మన పూర్వికులు నూనెను కర్మఫలంగాను, వత్తిని శరీరంగాను, జ్వాలను ప్రాణంగా భావిస్తారు. కర్మఫలం అనే నూనె ఉన్నంత వరకే వత్తి అనే శరీరంలో జ్వాల అనే ప్రాణం ఉంటుందని భావిస్తారు. సూర్యోదాయానికి పూర్వమే లేచి నది స్నానం చేసి పొడి బట్టలతో దీపారాధన చేయడం మంచిదని భావిస్తారు. ఈ మాసంలో జ్వాల తోరణాలతో వెలుగులు నింపుతాయి. ప్రతి దేవాలయాన్ని దీపాలతో అ లంకరించడంతో శోభాయమానంగా కనిపిస్తాయి.

మందుబాబులకు అడ్డాగా ఓపెన్ జిమ్



ముస్తాబాద్‌లో ఓపెన్ జిమ్ వద్ద మద్యం సీసాలు, ఆహార పదార్థాలు

ముస్తాబాద్, నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెద్దచెరువు కట్టపై గల ఓపెన్ జిమ్ మందుబాబులకు అడ్డాగా మారింది. తెల్లారిందంటే నిత్యం వాకర్స్, పొలాలకు వెళ్లే రైతులతో బిజీగా ఉండే ఓపెన్‌జిమ్‌లో రాత్రి అయిందంటే మందుబాటిళ్లు, తిను పదార్థాఆలతో జిమ్ ప్రదేశాన్ని అధ్వాన్నంగా మారుస్తున్నారు. పోలీసులు రాత్రిపూట చెరువుకట్టపై పెట్రోలింగ్ చేయాలని కట్టను, జిమ్‌ను కాపాడాలని కోరారు. ఇప్పటికే కట్టపై సేదతీరేందుకు వేసిన బెంచీలు దొంగలు ఎత్తుకెళ్లగా గ్రిల్స్‌ను సైతం చెదరగొట్టారని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

పల్లె ప్రకృతి వనంలో..

చందుర్తి నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో మూతపడిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. పల్లెప్రకృతి వనాల నిర్వహణను కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో నిత్యం మందుబాబులు మద్యం తాగుతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు.



పల్లె ప్రకృతి వనంలో మద్యం సీసాలు